క్లుప్తంగా

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు


సత్కారం పొందిన ఉద్యోగులతో సర్పంచ్ ధనలక్ష్మి నాగప్పారావు దంపతులు

మునగపాక: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులతో పాటు నూతనంగా విధుల్లోకి చేరిన ఉద్యోగులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, అయితే ప్రజలకు అందించిన సేవలే గుర్తుండిపోతాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.

నాగులాపల్లి పీఏసీఎస్ అభివృద్ధికి కృషి


తోటాడలోని గోదామును పరిశీలిస్తున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి భాస్కరరావు

మునగపాక: రైతుల సహకారంతో నాగులాపల్లి సహకార సంఘాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పర్సన్ ఇన్‌చార్జి యల్లపు వెంకట భాస్కరరావు తెలిపారు. నాగులాపల్లి సహకార బ్యాంక్ పరిధిలోని తోటాడలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన బహుళ ప్రయోజకర గోదామును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాముకు అనుగుణంగా ఉన్న స్థలం చదునుతో పాటు బోరు, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. త్వరలో మహాజన సభ ఏర్పాటు చేసేలా చూడాలని సీఈవో మళ్ల స్వామిని కోరారు. డైరెక్టర్లు జగదీశ్వరరావు, సుందరపు శ్రీనివాసరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

మునగపాక: రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చామని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం రైతులకు యూరియా సరఫరాకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులు కూడా నానో యూరియాపై దృష్టి సారించాలన్నారు. డీటీ మురళీధర్, ఏవోలు విజేత, జ్యోత్స్నకుమారి, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు అభినందన


నూతన ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ సంఘం నాయకులు

ఎస్.రాయవరం: భవిష్యత్ తరాలు సన్మార్గంలో నడవాలంటే ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు అన్నారు. ఇటీవల డీఎస్సీలో మండలం నుంచి ఎంపికైన అభ్యర్థులను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తిమ్మాపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, స్థానిక నాయకులు గుర్రం రామకృష్ణ, పప్పల శివ, విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డా బాబూరావు, సింహాచలం, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 160 మందికి వైద్య పరీక్షలు చేశారు. విశాఖపట్నం విష్ణు ఆసుపత్రి వారు నిర్వహించిన ఈ శిబిరంలో చర్మ, దంత వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

తిమ్మాపురంలో విద్యుత్ లైన్ ఏర్పాటు


విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న సత్యనారాయణ

ఎస్.రాయవరం: తిమ్మాపురంలో ప్రతి వీధిలోనూ విద్యుత్ సదుపాయం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపురం శివారులో కొత్తగా ఏర్పాటు చేసుకున్న నివాసాలకు పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలు కేటాయించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. ఈ వీధిలో ఇళ్ల లైన్‌తో పాటు స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు.


పెంటకోటలో చిక్కాల రామారావును అనకాపల్లి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు


పాయకరావుపేటలో దగ్గుపల్లి సాయిబాబా గృహ నిర్బంధం


పాయకరావుపేటలో ధనిశెట్టి బాబూరావు హౌస్ అరెస్ట్


పేటసూదిపురంలో అల్లాడ సూకరాజు ఇంట్లో అరెస్టు చేసిన దృశ్యం

హౌస్ అరెస్టులు.. అక్రమ నిర్బంధాలు

కూటమి పాలనలో అన్నదాతకు అవస్థలు తప్పలేదు. అసలే కష్టాల్లో ఉన్న అన్నదాతకు కూటమి ప్రభుత్వ తీరు ఆవేదన కలిగిస్తోంది. ఎంతో ఆశగా ఖరీఫ్ వరి సాగుకు సన్నద్ధమైన రైతుకు పూర్తి స్థాయిలో యూరియా అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అన్నదాత పోరుకు పిలుపునిచ్చింది. అన్నదాత పోరుకు అన్నదాతల నుంచి భారీ స్పందన రావడంతో ప్రభుత్వం కుతంత్రాలకు తెరతీసింది. అన్నదాత పోరుకు వెళ్లకుండా అధికారాన్ని ఉపయోగించి అడ్డంకులు సృష్టించింది. ఉదయం 5 గంటల నుంచే పార్టీ ముఖ్య నాయకులు అన్నదాత పోరుకు వెళ్లకుండా గృహ నిర్బంధాలు చేయించింది.

- అన్నదాత పోరుపై కూటమి ప్రభుత్వం కుట్ర
- ఎక్కడికక్కడ నాయకుల దిగ్బంధం
- ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులతో అడ్డంకులు

నక్కపల్లి/పాయకరావుపేట/కోటవురట్ల/ఎస్.రాయవరం: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రం అనకాపల్లిలో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. అయితే తెల్లవారుజామున నాలుగు గంటలకే నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ ఇళ్ల వద్ద పోలీసులను మోహరించారు. అడ్డురోడ్డులో ఉంటున్న నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులను ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. తాను సమన్వయకర్తనని జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి వెళ్లక తప్పదని, పంపించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి వస్తుందని హెచ్చరించడంతో జోగులను మాత్రం విడిచిపెట్టారు. ఇదే ప్రాంతంలో ఉంటున్న నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తిని, చినదొడ్డిగల్లులో ఉన్న వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావును గృహ నిర్బంధం చేశారు.

➡ కోటవురట్ల మండలం తంగేడులో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, పార్టీ అదనపు కార్యదర్శి వైస్ ఎంపీపీ దత్తుడు సీతబాబులను, జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, పాముల వాకలో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావుల ఇళ్ల వద్ద కూడా పోలీసులను కాపలా ఉంచి హౌస్ అరెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వి.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పెట్ల రాంబాబు, వంగలపూడి రాంబాబు, శానాపతి రమణ, సర్పంచులు బి.అనిల్‌కుమార్, పైల శివరామ్, శింగంపల్లి ఎరుకునాయుడు, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, తేటకాల నారాయణరావు, శానాపతి రామునాయుడు, పెన్నాడ రాంబాబు, పైల నాని, గొల్లు శ్రీను, చామంతుల శ్రీనివాసరావు, సురేష్, నానాజీ, డి.వి.రావు పాల్గొన్నారు.


తంగేడులో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజుకు సంఘీభావంగా తరలివచ్చిన నాయకులు


దార్లపూడిలో పెద ఈశ్వరరావుని అరెస్టు చేసిన పోలీసులు


గోకులపాడులో అద్దేపల్లి నూకునాయుడును అరెస్టు చేసిన పోలీసు

➡ ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో సీనియర్ నాయకుడు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, గోకులపాడులో అద్దేపల్లి నూకునాయుడు, పేటసూదిపురంలో అల్లాడ నాగరాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అయినా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పోలీసులు కళ్లుగప్పి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయానికి తరలివెళ్లారు. మండలం నుంచి వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు, మధువర్మ, గరగా శ్రీను, పోచిన నరేష్, తదితరులు తమ అనుచరులతో అనకాపల్లి వెళ్లి నిరసన తెలిపారు.

➡ పాయకరావుపేట మండలం పెంటకోటలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావును, జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, నామవరంలో ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, సీనియర్ నాయకుడు ధనిశెట్టి బాబూరావు, తదితర నాయకులను గృహ నిర్బంధాలు చేశారు. నక్కపల్లిలో వీసం రామకృష్ణను, కోటవురట్లలో మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ రాజు, జెడ్పీటీసీ ఉమాదేవిలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారని తెలుసుకున్న ఆయా మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు వారి ఇళ్ల వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీసం ఇంటి ముందు నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఆందోళనకు దిగారు.

సంక్షోభంలో వ్యవసాయం రంగం

రాష్ట్రంలో వ్యవసాయం రంగం సంక్షోభంలో ఉందని, రైతులకు యూరియా కూడా సరఫరా చేయలేకపోతున్నారని మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ రాజు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆరోపించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం కూడా పూర్తిగా ఇవ్వలేదన్నారు. రైతులకు పంటల బీమా వర్తింపజేయలేదని, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పార్టీ పిలుపు మేరకు ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకోవడం, గృహ నిర్బంధం చేయడం పిరికి పందల చర్య అని వారు ధ్వజమెత్తారు. మండల స్థాయి నాయకులనే కాకుండా సీనియర్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకుల ఇళ్ల వద్ద కూడా పోలీసులను కాపలా ఉంచడం గమనార్హం. నాయకుల గృహ నిర్బంధాలను వ్యతిరేకిస్తూ జరిగిన ఆందోళనల్లో సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, ఎంపీటీసీలు గొర్ల గోవిందు, పక్కుర్తి రమణ, నిట్ల గోవిందు, గంటా తిరుపతిరావు, గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు సూరాకాసుల గోవిందు, మనబాల తాతారావు, కొప్పిశెట్టి హరి, అల్లాడ కొండ, గొర్ల నర్సింహమూర్తి, అప్పలరాజు, బచ్చలరాజు, కొప్పిశెట్టి మోహన్, సిద్ధాబత్తుల సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల దిగ్బంధం


హౌస్ అరెస్టుకు గురైన వైఎస్సార్ సీపీ రాంబిల్లి మండల యువ నేత


అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రాంబిల్లి నేతలు

యలమంచిలి రూరల్/అచ్యుతాపురం రూరల్/మునగపాక: అనకాపల్లిలో జరిగిన వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లకుండా కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించింది. మంగళవారం ఉదయం 6 గంటలకే యలమంచిలి పట్టణంలో ఎంపీపీ బోదెపు గోవింద్, ఏటికొప్పాకలో యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, ఆమె భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సేనాపతి రాములను ఇళ్ల వద్దే పోలీసులు నిర్బంధించారు. అన్నదాతల కష్టాలు పరిష్కారమయ్యేలా కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు శాంతియుత నిరసన తెలియజేయడానికి వెళ్లకుండా పోలీసులతో ఆటంకాలు సృష్టించడాన్ని ప్రజలు తప్పుపట్టారు.

➡ అచ్యుతాపురం మండలం పెదపాడులో ఎంపీపీ కోన సంధ్య, పార్టీ సీనియర్ నాయకుడు కోన లచ్చన్నాయుడిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. భోగాపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాము, వెదురువాడలో మండల యూత్ అధ్యక్షుడు కారుకుండి శ్రీనును గృహ నిర్బంధం చేశారు.

➡ మండల కేంద్రం మునగపాకలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఇలాంటి చర్యలు కూటమి ప్రభుత్వానికి తగవని ఆయన హెచ్చరించారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): యూరియా కొరతపై రైతుల తరఫున పోరాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. నాయకులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేసింది. అయినప్పటికీ మంగళవారం అనకాపల్లిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించిన అన్నదాత పోరులో రాంబిల్లి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. ఎంపీపీ శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వాడనర్సాపురానికి చెందిన కొవిరి రామకృష్ణ, యువజన విభాగానికి చెందిన ధూళి వెంకీలను హౌస్ అరెస్టు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కిశోర్‌తో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు, రైతులు అనకాపల్లిలో నిర్వహించిన అన్నదాత పోరులో పాల్గొన్నారు.


వెదురువాడలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కారుకుండి శ్రీనును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు


యలమంచిలిలో ఎంపీపీ బోదెపు గోవింద్‌ను బయటకు వెళ్లకుండా నిర్బంధించిన పోలీసులు


ఏటికొప్పాకలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త రామును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసు


పెదపాడులో కోన లచ్చన్నాయుడిని గృహ నిర్బంధం చేసిన పోలీసు


మునగపాకలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు హౌస్ అరెస్ట్

'సేవా పక్షోత్సవాలు విజయవంతం చేయాలి'

మునగపాక: ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా సేవా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. నాగులాపల్లిలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న అనకాపల్లిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన, 14న విశాఖలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మళ్ల కాలేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ బొడ్డేడ భాస్కరరావు, మాజీ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సు రేపు

కోటవురట్ల: కైలాసపట్నంలోని సబ్ స్టేషన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ డీఈఈ అప్పారావు తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కూటమి ప్రభుత్వంపై ఆటో డ్రైవర్ల ఆగ్రహం



యలమంచిలిలో తమ సమస్యల పరిష్కారం కోసం నినాదాలు చేస్తున్న ఆటో కార్మికులు


ఆటో డ్రైవర్ల ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


అచ్యుతాపురంలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు


గణపర్తిలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

యలమంచిలి రూరల్: కూటమి ప్రభుత్వం ఆటో కార్మికుల ఆకలి కేకలు పట్టించుకోవడం లేదని యలమంచిలి ఆల్ ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లిమళ్ల నాగేశ్వరావు(నాగు) విమర్శించారు. స్త్రీశక్తి పథకంతో తమకు బతుకుదెరువు లేకుండా పోయిందని మంగళవారం యలమంచిలి ప్రధాన రహదారిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ చేపట్టారు. ఆటో కార్మికుల పొట్టకొట్టే విధంగా కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగడుతూ వారంతా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తామని చెప్పి 15 నెలలు గడుస్తున్నా అతీగతీ లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సబ్సిడీ ద్వారా ఇంధనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లిన ఆటో డ్రైవర్లు డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఏసుదాసు, పలు ఆటో యూనియన్ల నాయకులు కొండ, చందక సత్తిబాబు, నగిరెడ్డి శివకుమార్, షేక్ వల్లీ, కాసులు, బంగారు అప్పలనాయుడు, సైతారుపేట, కొక్కిరాపల్లి, సోమలింగపాలెం, పెదపల్లి, అడ్డురోడ్డు, పులపర్తి, రాంబిల్లి, అచ్యుతాపురం ఆటో స్టాండ్ల నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళనకు వైఎస్సార్‌సీపీ మద్దతు

మునగపాక: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తమ జీవనోపాధిని దెబ్బతీసిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం నిర్వహించిన ఆందోళనకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎంతో మంది ఆటో డ్రైవర్లు ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆటో డ్రైవర్లకు సాయం అందించేవారని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్లు బాగా దెబ్బతింటున్నారని వారి జీవనోపాధికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే ఆటో డ్రైవర్లకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

మునగపాక: తమ జీవనోపాధిని దెబ్బకొట్టిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గణపర్తిలో మంగళవారం సిద్ధి వినాయక నూకాంబిక ఆటో యూనియన్ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. స్త్రీశక్తి పథకం కారణంగా ఆటో డ్రైవర్లు వీధిన పడాల్సి వస్తుందని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి దార వెంకట శంకర్, కాండ్రేగుల జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశారు. తమ బతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. తమకు న్యాయం చేయకుంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ కోశాధికారి యల్లపు రాజు, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం యువశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యువశక్తి యూనియన్ అధ్యక్షుడు దమ్ము చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడేలా చేసిందన్నారు. ఆటో కార్మికుడికి ప్రతి నెలా రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ సర్పంచ్ తట్టా రాజు, సెక్రటరీ పోలవరపు అప్పారావు, కోశాధికారి ధర్మిరెడ్డి సన్నిబాబు, అడతా రమణబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో జి.రమేష్‌బాబు

పాయకరావుపేట: దివ్యాంగ విద్యార్థులకు సమగ్ర శిక్షణ నుంచి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జి.రమేష్‌బాబు కోరారు. నియోజకవర్గంలోని 4 మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు గుర్తింపు శిబిరం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మంగళవారం జరిగింది. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల నుంచి 200 మంది దివ్యాంగులు హాజరయ్యారు. వారిని పరీక్షించి, బోధనోపకరణ, సామగ్రి కిట్టు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్లు అవసరమని గుర్తించినట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షణ జిల్లా సహిత సమన్వయకర్త బి.రామకృష్ణ, ఆల్మీకో సంస్థ వైద్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి కృషి

పాయకరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని స్థానిక పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజుబాబు అన్నారు. సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులకు ఎరువులు సరఫరా చేయడంతో పాటు రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. సంఘం సీఈవో పి.నాగభూషణం అజెండాను సభకు చదివి వినిపించారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, యాళ్ళ వరహాలు, చింతలపు పద్దూ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మకమలం పూసింది..!


అల్లూరి సీతారామరాజు కాలనీలో విరబూసిన బ్రహ్మకమలం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో యలమంచిలి తాలూక పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వరరావు నివాసంలోని మొక్కకు బ్రహ్మకమలం పూసింది. ఆరేళ్ల క్రితం విహారయాత్రకు చింతపల్లి వెళ్లినప్పుడు అక్కడ్నుంచి ఈ మొక్కను తెచ్చి ఇంటి ఆవరణలో నాటారు. గత మూడేళ్లుగా ఈ సీజన్లో ఒకటి, రెండు పూలు మాత్రమే పూసేవని, ఈ ఏడాది ఐదు మొగ్గలు రాగా.. మొదటగా మంగళవారం రాత్రి ఒక పువ్వు వికసించిందని సోమేశ్వరరావు తెలిపారు. చుట్టు పక్కల వారు ఈ బ్రహ్మకమలాన్ని ఆసక్తిగా తిలకించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గుంటపల్లి జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్‌ను మంగళవారం పాఠశాలలో సన్మానించారు. ఆయనకు ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వేణు, జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, ఉపాధ్యాయులు ప్రసన్న కుమార్, శ్రీను, గణేష్, తదితరులు అభినందనలు తెలిపారు.